AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

24-12-2025 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2


## పీసీసీ అధ్యక్షుడిని కలిసిన సర్పంచ్



**భీమ్‌గల్, అక్షరటుడే:** భీమ్‌గల్ మండలం చేంగల్ సర్పంచ్‌గా ఎన్నికైన దుమాల రాజు, బుధవారం పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్‌ను బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామంలోని పలు అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల గురించి పీసీసీ అధ్యక్షుడికి వివరించారు. చేంగల్ గ్రామ సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ ముఖ్య నాయకులు, అనుచరులు పాల్గొన్నారు.







## ముస్తాబైన చర్చీలు

క్రిస్‌మస్ వేడుకలకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సిద్ధమైంది. ఇందులో భాగంగా చర్చీలను ముస్తాబు చేశారు. చర్చీలలోని ఆవరణను విద్యుత్ దీపాలతో పాటు క్రిస్‌మస్ ట్రీలు, శాంటాక్లాజ్ తదితర వాటితో అలంకరించారు. గురువారం క్రైస్తవులు చర్చీలలో ప్రార్థనలు చేయనున్నారు.

—అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్



## కేంద్ర ప్రభుత్వ స్టాండింగ్ కౌన్సిల్స్ నియామకం

**అక్షరటుడే, ఇందూరు:** భారత ప్రభుత్వ జిల్లా స్టాండింగ్ కౌన్సిల్‌గా సీనియర్ న్యాయవాది సాయిరెడ్డి నియమితులయ్యారు. అలాగే అడిషనల్ స్టాండింగ్ కౌన్సిల్ గా సీనియర్ న్యాయవాదులు కృష్ణ ఆనంద్, మల్లెపూల జగన్‌మోహన్ గౌడ్, నాగేశ్వర్, ఆకుల సురేష్, వెంకటేశ్వర్, నరసింహారెడ్డి, రాజేశ్వర్లను నియమిస్తూ కేంద్ర ప్రభుత్వ న్యాయ మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించడంలో ప్రభుత్వం తరఫున వీరు వాదించనున్నారు. వీరు మూడేళ్ల పదవిలో కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



## జీజీ కళాశాలలో జాతీయ సదస్సు

**అక్షరటుడే, ఇందూరు:** గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్యశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో వచ్చే ఏడాది మార్చిలో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. "డిజిటల్ వేవ్స్ ఇన్ కామర్స్ అపర్చునిటీస్ అండ్ చాలెంజర్స్" అనే అంశంపై సెమినార్ ఉంటుందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రంగరత్నం వాణిజ్య విభాగాధిపతి వినయ్ కుమార్, ఆయా సబ్జెక్టుల విభాగాధిపతులు డాక్టర్ రంజిత, డాక్టర్ రామస్వామి డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ రామస్వామి, సూపరింటెండెంట్ ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రలోభాలకు లొంగి పార్టీ మారొద్దు: గంప గోవర్ధన్



**అక్షరటుడే, కామారెడ్డి :** బీఆర్ఎస్ మద్దతుతో గెలిచిన సర్పంచులు అధికార పార్టీ ప్రలోభాలకు తలొగ్గి.. పార్టీ మారవద్దని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వెలమ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం బీఆర్ఎస్ మద్దతుతో గెలిచిన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ మాట్లాడుతూ.. రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో గ్రామ పంచాయతీలకు నయా పైసా మంజూరు చేయలేదని విమర్శించారు. వచ్చే రెండేళ్లు కూడా రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి నిధులు విడుదల చేయబోదని వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వమే పంచాయతీలకు నేరుగా నిధులు విడుదల చేస్తుందన్నారు. ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకొని సర్పంచులుగా గెలిపించారని, ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఆదర్శంగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ ఛైర్మన్ ప్రేంకుమార్, మాజీ జెడ్పీటీసీలు గోపి గౌడ్, రాంరెడ్డి, నల్లవెల్లి అశోక్, మాజీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



**అక్రమాస్తుల కేసులో మహబూబ్‌నగర్ జిల్లా డీటీసీ కిషన్ నాయక్ ఏసీబీకి చిక్కడం, అతని వద్ద రూ. వందల కోట్ల ఆస్తులు గుర్తించడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఇప్పటికే కిషన్ నాయక్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఏసీబీ అధికారులు తదుపరి దర్యాప్తును ముమ్మరం చేశారు.**

- అక్షరటుడే, నిజామాబాద్



# డీటీసీ ఆస్తులు రూ. వందల కోట్లు..!

- నిజామాబాద్‌లోనూ బడా బిల్డర్లతో వ్యాపార భాగస్వామ్యం
- అక్రమాస్తులపై లోతుగా విచారిస్తున్న ఏసీబీ

మహబూబ్‌నగర్ డీటీసీగా పనిచేస్తున్న కిషన్ నాయక్‌పై మొదటి నుంచి తీవ్ర అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా రూ. వందల కోట్ల ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీకి వరుస ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో గత కొద్దిరోజులుగా నిఘా ఉంచిన ఏసీబీ అధికారులు పక్కా ఆధారాలు సేకరించి కిషన్ నాయక్ ఇంట్లో సోదాలు చేపట్టారు. ఇదే సమయంలో హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి, ఆర్ఆర్‌నగర్‌లోని కిషన్ నాయక్ నివాసాలతో పాటు నిజామాబాద్ జిల్లాలోనూ సోదాలు చేపట్టారు. మొత్తంగా బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం.. రూ. 250కోట్లకుపైగా ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ గుర్తించింది.

### నిజామాబాద్ ఆస్తులపై చర్చ

నిజామాబాద్‌లోని బైపాస్ రోడ్డులో గల హోటల్ లహరి ఇంటర్నేషనల్‌లో 50 శాతం వాటా కిషన్ నాయక్‌కు ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది. అలాగే దీనికి ఆనుకుని ఉన్న రాయల్ ఓక్ స్థలం 3వేల గజాలు మొత్తం కూడా కిషన్ నాయక్‌దేనని తేల్చారు. అశోక్ టౌన్ షిప్‌లో రెండు ఫ్లాట్లు, నిజామాబాద్ మున్సిపల్ కమిషనరేట్ పరిధిలో కమర్షియల్ ల్యాండ్ పది ఎకరాల మేర గుర్తించారు. అయితే లహరి హోటల్, అశోక టౌన్ షిప్, రాయల్ ఓక్ ఇవన్నీ కూడా ప్రముఖ బిల్డర్లకు చెందినవి. దీంతో సదరు అశోక టౌన్ షిప్ లోనూ కిషన్ నాయక్‌కు వాటాలు ఉన్నట్లు తెలుస్తోంది. సదరు బిల్డర్లతో కలిసి స్లీపింగ్ పార్ట్‌నర్‌గా ఉంటూ రియల్ ఎస్టేట్ దందా సాగించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. దీంతో ఈ కోణంలోనూ ఏసీబీ అధికారులు విచారణ మొదలుపెట్టారు.

### పదెకరాల స్థలం ఎక్కడ..?

అవినీతి నిరోధక శాఖ అధికారుల సోదాల్లో డీటీసీ కిషన్‌నాయక్‌కు సంబంధించి నిజామాబాద్ నగర శివార్లలో పది ఎకరాల మేర కమర్షియల్ స్థలం ఉన్నట్లు గుర్తించారు. కాగా.. ఈ స్థలం ఎక్కడ ఉంది..? ఇందులో ఎవరెవరు వాటాదారులు ఉన్నారు..? ప్రస్తుతం వివిధ శాఖల్లో ఉండి రియల్ ఎస్టేట్ వ్యాపారం నడుపుతున్న అధికారులతో కలిసి కిషన్ నాయక్ భాగస్వామిగా మారాడా..? అనే రకరకాల చర్చోపచర్చలు తెరపైకి వస్తున్నాయి. కాగా.. బైపాస్ రోడ్డులో సైతం కిషన్ నాయక్‌కు ఖరీదైన స్థలాలు ఉన్నట్లు తెలుస్తోంది.

## ఐక్యంగా ఉంటేనే అధికారం సాధించుకోవచ్చు: పీసీసీ చీఫ్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** బీసీలలో ఐక్యత, చైతన్యం రావాలని పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కలిసి ఉంటేనే అధికారాన్ని సాధించుకోవచ్చని పేర్కొన్నారు. నిజామాబాద్ నగరంలోని వినాయక్ నగర్‌లో ఏర్పాటు చేసిన జ్యోతిబాపూలే విగ్రహాన్ని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. జ్యోతిబా పూలే 1931లో అప్పటి జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. మహిళల్లో చైతన్యం తెచ్చి చదువుకుని అన్ని రంగాల్లో ముందు ఉండడానికి అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. జ్యోతిబాపూలే మొట్టమొదటి మహిళా టీచర్ కావడం గర్వించదగ్గ విషయమన్నారు. నేటి తరం యువతకు చరిత్ర తెలియడం లేదని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. వారు చరిత్రను చదవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. బీసీలంతా ఒక్కటిగా ఉంటేనే విజయాలు సాధించవచ్చన్నారు. ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ దేశంలో ఎవరూ చేయని సాహసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చే శారు. కుల గణన చేపట్టి చరిత్రలో నిలిచారని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ,మైనార్టీలు కలిసి 86 శాతం గెలుపొంది ఐక్యతను చాటారన్నారు. పార్టీ పరంగా బీసీలకు తగినన్ని సీట్లు ఇచ్చి గెలిపించుకోగలిగామన్నారు. నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధిక శాతం బీసీలు, మహిళలు ఉన్నారని



అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ లో బీసీలకు అత్యధిక నిధులు కేటాయించాలని కోరారు. 42 శాతం బీసీ రిజర్వేషన్‌కు అసెంబ్లీలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పూర్తి మద్దతును ప్రకటించామన్నారు. రిజర్వేషన్లు రాజ్యాంగ పద్ధతిలో ఉంటే కేంద్ర ప్రభుత్వం తప్పకుండా మద్దతును తెలియజేస్తుందన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్, కో-ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నరాల రత్నాకర్, ఆకుల లలిత, అంతిరెడ్డి రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, నుడా ఛైర్మన్ కేశ వేణు తదితరులు పాల్గొన్నారు.

## న్యూట్రిషన్ రైస్ మిల్లు పరిశీలన




**అక్షరటుడే, ఇందూరు:** నగర శివారులోని ఖానాపూర్‌లో కొనసాగుతున్న కేసీపీ న్యూట్రిషన్ రైస్ మిల్లును కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి బుధవారం తనిఖీ చేశారు. పోషకాలతో కూడిన ఫోర్టిఫైడ్ కెర్నెల్ రైస్‌ను ఉత్పత్తి చేస్తున్న తీరును పరిశీలించారు. ప్రభుత్వం ప్రతినెలా రేషన్ దుకాణాల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అందిస్తున్న సన్న బియ్యంలో పోషకాల కోసం ఫోర్టిఫైడ్ రైస్‌ను కలిపి పంపిణీ చేస్తోంది. ఈ నేపథ్యంలో నిబంధనలకు అనుగుణంగా నాణ్యతతో తయారు చేస్తున్నారా లేదా అని పరిశీలించారు. మిల్లు నిర్వాహకుడు కాపర్తి శ్రావన్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల ఆరోగ్యాలతో ముడిపడి ఉన్నందున తగిన పరిమాణంలో పోషకాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట సివిల్ సప్లయ్స్ డీఎం శ్రీకాంత్ రెడ్డి ఉన్నారు.




## పేద ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** పేద ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. నిజామాబాద్ నగరంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో బుధవారం కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలను ఆదుకునేందుకు ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. 481 లబ్ధిదారులకు రూ. 4.81 కోట్ల షాదీ ముబారక్, 187 లబ్ధిదారులకు 1.87 కోట్ల కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ఎన్ని ఇబ్బందుల్లో ఉన్నా ఇచ్చిన మాట ప్రకారం పథకాలన్నీ అమలు చేస్తున్నామన్నారు. రూ. 500కు సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు, రైతు రుణమాఫీ, రైతు భరోసా, యువతకు ఉద్యోగాలు, సన్న బియ్యం పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నుడా ఛైర్మన్ కేశ వేణు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.




## గ్రామాల అభివృద్ధిలో కార్యదర్శులు క్రియాశీలక పాత్ర పోషించాలి

**అక్షరటుడే, బోధన్:** పల్లెల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులు క్రియాశీలక పాత్ర పోషించాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి సూచించారు. పట్టణంలోని లయన్స్ భవన్‌లో బుధవారం బోధన్ నియోజకవర్గ స్థాయి పంచాయతీ కార్యదర్శుల పనితీరు, విధులు, బాధ్యతల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, సబ్ కలెక్టర్ వికాస్ మహతో తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. పల్లెల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా పల్లెల ప్రగతి కోసం పంచాయతీ కార్యదర్శులు అంకిత భావంతో కృషి చేయాలన్నారు. అలసత్వ వైఖరిని ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీపీవో శ్రీనివాస్ రావు, బోధన్ డీఎల్పీవో నాగరాజు, ఆయా మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, కార్యదర్శులు పాల్గొన్నారు.



## అయ్యప్ప ఆలయానికి రూ. 1.18 లక్షల విరాళం

అక్షరటుడే, ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలోని అయ్యప్ప ఆలయంలో పడి మెట్టు కోసం రూ.1.18 లక్షల విరాళాన్ని బీజేపీ నాయకుడు, అయ్యప్ప భక్తుడు సాయిరాం గౌడ్ అందజేశారు. గతంలో నిర్వహించిన పూజలో ఒప్పుకున్న ప్రకారం విరాళాన్ని బుధవారం అందించారు. ఇందుకు సంబంధించిన చెక్కును ఆలయ కమిటీ అధ్యక్షుడు పద్మ శ్రీకాంత్‌కు అందించారు. కార్యక్రమంలో చంద్రం గురు స్వామి, ఆలయ పూజారి శ్రీనివాస స్వామి, నాగేశ్ గురు స్వామి, మాజీ వైస్ ఎంపీపీ నునుగొండ శ్రీనివాస్, యాదగిరి స్వామి, సంతు స్వామి పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డిని కలిసిన వన్నెల్(బి) సర్పంచ్

**అక్షరటుడే, బాల్కొండ:** మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డిన ఇటీవల నూతనంగా ఎన్నికైన వన్నెల్ (బి) సర్పంచ్ బక్కూరి భూమేశ్వర్, పాలకవర్గ సభ్యులు కలిశారు. వేల్పూర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో బుధవారం కలిసి సన్మానం చేశారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యలపై చర్చించారు.

## గ్రామాల అభివృద్ధిలో సర్పంచులదే ప్రధాన పాత్ర



**అక్షరటుడే, బాన్సువాడ:** గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు, పాలకవర్గ సభ్యులదే ప్రధాన పాత్ర అని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తూ.. గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. బాన్సువాడ పట్టణ శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గంలో గెలుపొందిన సర్పంచ్‌లను సన్మానించారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజు, మాజీ డీసీసీబీ ఛైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, నాయకులు పోచారం సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలతో మమేకమై పని చేయాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** నూతనంగా ఎన్నికైన పంచాయతీ పాలకవర్గాలు ప్రజలతో మమేకమై, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి అన్నారు. బాన్సువాడ మండలం దేశాయిపేట సర్పంచ్‌గా ఎన్నికైన భునేకర్ జ్యోతి ప్రకాష్, ఆరుగురు వార్డు మెంబర్లు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. వారితో ఎంపీడీవో ఆనంద్ ప్రమాణం చేయించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏనుగు రవీందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పాలకవర్గాలు సమష్టిగా పనిచేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

## కొత్త బస్టాండ్ ఆవరణలో పారిశుధ్య పనులు



**అక్షరటుడే, భీమ్‌గల్:** పట్టణంలోని నూతన బస్టాండ్ నుంచి బస్సుల రాకపోకలు పునఃప్రారంభమైన నేపథ్యంలో ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా బస్టాండ్ పరిసరాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. బుధవారం బస్టాండ్ ఆవరణలో బ్లేడ్ ట్రాక్టర్ సహాయంతో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. అలాగే భూమిని చదును చేశారు. ఈ పనులను మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. బస్టాండ్ ప్రాంతంలో ఎక్కడా వ్యర్థాలు లేకుండా చూడాలని శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. అదేవిధంగా, రోడ్డు డివైడర్ల వెంబడి పేరుకుపోయిన మట్టిని తొలగించి ఎప్పటికప్పుడు రహదారులను శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రైతులకు అవగాహన సదస్సు



**అక్షరటుడే, లింగంపేట:** మండలంలోని బాణా పూర్‌లో నాగార్జున కంపెనీ ఆధ్వర్యంలో బుధవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రస్తుత వాతావరణం దృష్ట్యా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మార్కెటింగ్ మేనేజర్ దినేష్ రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ సురేంద్ర, టెరిటరీ మేనేజర్ శ్యాంరావు, గ్రామ రైతులు పాల్గొన్నారు.



# యాసంగి సాగుకు భరోసా

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ కింద లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రస్తుతం యాసంగి పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ క్రమంలో ఆయకట్టు రైతుల కోసం సాగునీటి విడుదలను ఎస్సారెస్పీ అధికారులు బుధవారం ప్రారంభించారు. కాకతీయ, సరస్వతి కాల్వలకు నీటి విడుదల చేపడుతున్నారు. దీంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్ట్ నిండుకుండలా ఉండడంతో యాసంగి పంటలకు ఢోకా లేదని పేర్కొంటున్నారు. - అక్షరటుడే, బాల్కొండ

- ఎస్సారెస్పీ నుంచి నీటి విడుదల ప్రారంభం
- 8 తడులు అందించనున్న అధికారులు
- 51.04 టీఎంసీల కేటాయింపు
- ఆయకట్టు రైతుల హర్షం

జిల్లాలో ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిశాయి. దీంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ భారీగా వరద వచ్చింది. వానాకాలం అయిపోయి రెండు నెలలు గడుస్తున్నా.. ఇంకా ప్రాజెక్ట్ నిండుకుండలా ఉంది. దీంతో అధికారులు పూర్తి ఆయకట్టుకు నీటి విడుదల చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ఎల్ఎండీ ఎగువన ఉన్న 6 లక్షల ఎకరాలకు, ఎల్ఎండీ దిగువన 3.6 లక్షల ఎకరాలు మొత్తం 9.6 లక్షల ఎకరాలకు వారంబందీ ప్రకారం నీటి విడుదల చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. వారబందీ ప్రకారం 7 రోజులు నీటి విడుదల 8 రోజులు నిలిపివేత ఉంటుంది.



### నీటి కేటాయింపులు ఇలా..

యాసంగి సీజన్ కోసం కాకతీయ కాలువకు 41.43 టీఎంసీలు, సరస్వతి కాలువకు 3.39 టీఎంసీలు, లక్ష్మి కాలువకు 1.48 టీఎంసీలు, అలీసాగర్ ఎత్తిపోతలకు 2.29 టీఎంసీలు, గుత్ప ఎత్తిపోతలకు 1.14 టీఎంసీలు, ముంపు గ్రామాల లిఫ్ట్‌లకు 1.32 టీఎంసీలు కేటాయించారు. మొత్తం 51.04 టీఎంసీలను ఆయకట్టుకు కేటాయించారు. ఈ మేరకు అధికారులు గురువారం కాల్వల ద్వారా నీటి విడుదలను ప్రారంభించారు.

### కాకతీయ కాలువకు 3,500 క్యూసెక్కులు

ప్రాజెక్టు సూపరింటెండింగ్ ఇంజనీర్, ఇతర అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు కాకతీయ కాలువకు నీటి విడుదలను ప్రారంభించారు. వారాబందీ ప్రకారం కాకతీయ కాలువ పరిధిలోని జోన్ -1, జోన్-2లకు నీటిని వదలనున్నారు. ప్రస్తుతం 3,500 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సరస్వతి కాలువకు సైతం నీటి విడుదలను అధికారులు ప్రారంభించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఇంజినీర్లు, నిర్మల్ నీటిపారుదల శాఖ అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. 350 క్యూసెక్కులను కాలువకు వదులుతున్నారు.



## హక్కుల ఉద్యమ నేత సభను విజయవంతం చేయాలి



**అక్షరటుడే, బోధన్:** మానవ హక్కుల వేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి మాధవరావు ప్రథమ వర్ధంతి సభను విజయవంతం చేయాలని జిల్లా ప్రతినిధులు కోరారు. ఈ నెల 28న ఆదివారం ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మ గుట్టలో సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బోధన్ పీఆర్‌టీయూ భవన్‌లో బుధవారం మాధవరావు స్మారకోపన్యాస సభ వాల్ పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మానవ హక్కుల వేదిక జిల్లా ప్రతినిధి, న్యాయవాది జి.శ్రీనివాస్ మాట్లాడుతూ.. గొర్రెపాటి మాధవరావు నాలుగు దశాబ్దాలకు హక్కుల ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేశారన్నారు.

## సీఎం చిత్రపటానికి పాలాభిషేకం..



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలం గగ్గుపల్లిలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి బుధవారం పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నడిపి గంగాధర్ మాట్లాడుతూ.. ఇద్దరు పిల్లలకన్నా ఎక్కువ మంది ఉన్నా పోటీకి అర్హులుగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తమకు ఎంతో మేలు చేసిందన్నారు.





# ముగిసిన కాకతీయ అకడమిక్ మహోత్సవం

**అక్షరటుడే, ఇందూరు:** అకడమిక్ మహోత్సవాన్ని స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని కాకతీయ విద్యాసంస్థల డైరెక్టర్ రజనీకాంత్ తెలిపారు. శ్రీనివాస రామానుజన్ జయంతి, మండవ వెంకట సుబ్బారావు స్మారకంగా.. మూడు రోజులుగా నిర్వహిస్తున్న అకడమిక్ మహోత్సవం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా రజనీకాంత్ మాట్లాడుతూ.. స్పెల్‌థాన్ పేడ్, కాకతీయ క్విజ్ థాన్, మ్యాచ్ రత్న అకాడమిక్ గేమ్స్ తదితర కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించామన్నారు. సబ్జెక్టుపై ఆసక్తిని పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. అనంతరం ఆయా విభాగాల్లో విజయం సాధించిన విద్యార్థులకు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్లు రామోజీరావు, రాజా, సిబ్బంది పాల్గొన్నారు.

## ముున్సిపల్ ఉద్యోగి మృతి

**అక్షరటుడే, బోధన్ :** బోధన్ మున్సిపాలిటీలో పారిశుధ్య విభాగంలో పనిచేసే జూనియర్ అసిస్టెంట్ ఆనంద్ కాలే మృతి చెందాడు. అనారోగ్య కారణాలతో నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం చనిపోయారు. ఆయన మృతిపై మున్సిపల్ కమిషనర్ కృష్ణ జాదవ్ సంతాపం తెలిపారు. ఆనంద్ మృతితో మున్సిపాలిటీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకున్న మైనార్టీ గురుకుల విద్యార్థులు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** నిజామాబాద్‌లో జరిగిన మూడో జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ఎల్లారెడ్డిలోని తెలంగాణ మైనారిటీ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. అలాగే పదో తరగతికి చెందిన డి.అఫ్రోజ్ అండర్ 17 లాంగ్ జంప్‌లో రజత పతకాన్ని సాధించాడు. ఎనిమిదో తరగతికి చెందిన బీమల్ అండర్ 14 లాంగ్ జంప్‌లో కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు. వీటితో పాటు పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి ఆదిల్ అండర్ 17 ఫుట్‌బాల్ రాష్ట్ర స్థాయి జట్టుకు, పదో తరగతికి చెందిన అరవింద్, అన్సార్ అండర్ 17 రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారు. అలాగే పదో తరగతికి చెందిన అఫ్రోజ్, ఆసిఫ్, అనాస్ అండర్ 17 రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, ప్రిన్సిపల్ మహమ్మద్ రఫత్, పీఈటీ జ్ఞానేశ్వర్, ఎస్కార్ట్ టీచర్లను బుధవారం ప్రత్యేకంగా అభినందించారు.




## నాగాపూర్‌లో నట్టల నివారణ మందుల పంపిణీ



**అక్షరటుడే, బాల్కొండ:** పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బాల్కొండ మండలంలోని నాగాపూర్ గ్రామంలో 1,137 మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. నాగాపూర్ సర్పంచ్ పోలేపల్లి హేమలత-లక్ష్మీనారాయణ, ఉప సర్పంచ్ ఎంబరీ నర్సయ్య చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ ఆర్.ఉజ్వల, జీవాల పెంపకదారులు చిన్న మల్లయ్య, మహేందర్, నాగేష్, మనీష్, గోపాలమిత్ర ప్రణీత్, షకీల్, బషీర్, ఆఫీస్ సబార్డినేట్ లక్ష్మి, పశుమిత్రలు పాల్గొన్నారు.



## వెల్గటూర్, సావెల్ గ్రామాల్లో..

**అక్షరటుడే, మెండోరా:** వెల్గటూర్, సావెల్ గ్రామాల్లో మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందుల పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి గౌతమ్ రాజు, చిన్నయ్య, రమేష్, సునీల్, గంగాధర్, నందు, పవన్, చిన్నయ్య, అగ్గు శ్రీనివాస్, గొల్ల గంగాధర్, గడ్డం బక్కన్న, పుట్టి దేవేందర్ పశువైద్య సిబ్బంది ప్రవీణ్, మల్లేష్ పాల్గొన్నారు.



## సర్పంచుల ఫోరం అధ్యక్షురాలిగా సాయవ్వ

**అక్షరటుడే, ముప్కాల్ :** ముప్కాల్ మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షురాలిగా ముప్కాల్ సర్పంచ్ కొమ్ముల సాయవ్వ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం ఎన్నికలు నిర్వహించారు. సాయవ్వ అందుబాటులో లేకపోవడంతో ఆమె భర్త కొమ్ముల శ్రీనివాస్‌కు ఎన్నిక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వెంచిర్యాల, నల్లూర్, నాగంపేట్, కొత్తపల్లి తదితర గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## పడగల్ సర్పంచ్, ఉపసర్పంచ్‌కు సన్మానం



**అక్షరటుడే, భీమ్‌గల్ :** పడగల్ గ్రామ సర్పంచ్ నల్ల రాజు, ఉపసర్పంచ్ నరేందర్‌లను భీమ్‌గల్ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ముత్యం రెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో నిర్వహించారు. గ్రామాభివృద్ధిలో వారు చూపిస్తున్న చొరవను ఈ సందర్భంగా ముత్యం రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ గడ్డం నర్సారెడ్డితో పాటు డైరెక్టర్లు గంగాధర్, రవి, రాజేష్, మహిపాల్, సాయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.